ప్రజాశక్తి

శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

5

విజయనగరం

టోల్‌గేట్ సిబ్బందితో మంత్రి లోకేష్ సందడి

ప్రజాశక్తి - భోగాపురం, డెంకాడ

జాతీయ రహదారిపైనున్న నాతవలస టోల్ గేట్ వద్ద మంత్రి నారా లోకేష్ టోల్ గేట్ సిబ్బందితో సందడి చేశారు. శ్రీకాకుళం నుంచి విశాఖ రోడ్డు మార్గంలో వెళ్తున్న సమయంలో టోల్ గేట్ వద్ద కొంతసేపు ఆగారు. ఈ సందర్భంగా టోల్ గేట్ ప్రెసిడెంట్ చింతపల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఆవాల నరేష్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సన్మానించారు. అనంతరం టోల్గేట్ సిబ్బందితో సెల్ఫీలు తీసుకున్నారు. హైవే మేనేజర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రితో సెల్ఫీలు దిగుతున్న టోల్‌ప్లాజా సిబ్బంది

పనికి వెళ్లనివారికి మస్తర్లు వేశారు. ముడుపులు చెల్లిస్తేనే ఉపాధి పనులు. ఇందుకు నిరాకరించినవారికి జాబ్‌కార్డులు లేకుండా చేసేస్తామంటూ బెదిరింపులు. ఆపై చర్చి నిర్మాణం పేరిట వసూళ్లు. చివరకు చనిపోయినవారి జాబ్‌కార్డులను కూడా ఉపయోగించారు. వినిపోయిన బాధితులు, వారి తరఫున మరో వ్యక్తి ఏకంగా జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన విచారణకు ఆదేశించడంతో ఈ బండారం బయటపడింది. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌తోపాటు ఎపిఒపై మోపిన అభియోగాలు వాస్తవమేనంటూ ఉపాధి కార్మికులు ఏకోన్ముఖంగా సాక్ష్యం చెప్పారు. గంట్యాడ మండలం నరవ గ్రామంలో చోటు చేసుకున్న ఈ పరిణామంపై అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో వేచిచూడాల్సిందే.

పనికి వెళ్లని వారికి మస్తర్లు

- ముడుపులు చెల్లిస్తేనే ఉపాధి
- చర్చి నిర్మాణం పేరిట వసూళ్లు
- ఉపాధి హామీలో వెలుగు చూసిన వాస్తవాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/గంట్యాడ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఏటా 100 రోజుల పని గ్యారెంటీ కల్పించిన సంగతి తెలిసిందే. ఈ చట్టాన్ని నరవ గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్, ఎపిఒ ఏకంగా చుట్టంగా మార్చేసుకున్నారు. అవినీతి, అక్రమాలు పెచ్చుమీరడంతో బాధితుల తరఫున సుంకరి శ్రీనివాస్ అనే వ్యక్తి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆగస్టు 12న ఫీల్డ్ అసిస్టెంట్ పతివాడ అప్పల నారాయణమ్మపై ఫిర్యాదు చేశారు. మంత్రి ఆదేశంతో విచారణ అధికారిగా గజపతినగరం ఎపిడి టి.జనార్దనరావును అప్పటి డ్వామా పిడి ఉమామహేశ్వరి విచారణ అధికారిగా నియమించారు. ఆయన విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్‌తోపాటు గంట్యాడ ఎపిఒపైనా ఫిర్యాదులు వచ్చాయి. ఆ విచారణ నివేదికను గత నెలాఖరుకు ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ నివేదిక ప్రకారం.... సరిది కొండమ్మకు (జాబ్ కార్డు నెంబర్ 10182) నాలుగు రోజుల పనికి రూ.600 వేతనం వచ్చింది. ఇందులో రూ.100 ఫీల్డ్ అసిస్టెంట్ అడిగి తీసుకున్నారు. రూ.450 చొప్పున వసూలు చేశారని, ఇలా మేట్ల ద్వారా సమకూరిన రూ.1500 ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇచ్చినట్టు సుంకరి సరోజిని (జాబ్‌కార్డు నెంబర్ 10423) చెప్పింది. జాబ్‌కార్డు తీసేస్తామని బెదిరించడంతో మేటు దుర్గ, ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.1500 ఇచ్చినట్టు ఇజ్జపురపు కృష్ణమ్మ (జాబ్‌కార్డు నెంబర్ 10062) ఆవేదన వ్యక్తం చేశారు. పనికి వచ్చినవారంతా డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ తన వద్దకూడా తీసుకున్నారంటూ తోమురోతు భద్రమ్మ చెప్పింది. తన వద్ద రూ.1000 తీసుకున్నట్టు పిన్నింటి రాములమ్మ తెలిపింది. జాబ్‌కార్డు తీసేస్తామంటూ బెదిరించడంతో ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద రూ.584 వరలక్ష్మీనారాయణ పాపారి అమ్మాయమ్మ చెప్పింది. మునుపు నాయుడు జాబ్‌కార్డు (10267)లో అతని పనికి బోడ అప్పయ్యమ్మ పేరును చేర్చారు. తద్వారా దుర్వినియోగం జరిగింది. ఇలా భవిరి శెట్టి అప్పన్న, నరవ అప్పలస్వామి తదితరులు ఎపిడి ఎదుట వాంగ్మూలం ఇచ్చారు.

చేయని పనికి రూ.3.29 లక్షలు డ్రా

కేవలం వేతన దారులను బెదిరించి డబ్బులు గుంజడమే కాకుండా గ్రామంలో చేయని పనులకు కూడా ప్రభుత్వం నుంచి రూ.లక్షలు డ్రా చేసినట్టు ఎపిడి విచారణలో తేలింది. విచారణ అధికారి ఎపిడి ఇచ్చిన నివేదిక ప్రకారం గ్రామంలోని భద్రమ్మ చెరువులో పని చేపట్టలేదు. కానీ, అక్కడ 2008 నుంచి 2013 వరకు దఫదఫాలుగా పని జరిగినట్టుగా చూపించి మొత్తం రూ.3,29,895 డ్రా చేశారు. ఇదే గ్రామంలో అనర్హులకు టేకు, మామిడి మొక్కలను కూడా సబ్సిడీపై కట్టబెట్టినట్టుగా సాక్షాత్తు సామాజిక తనిఖీలోనే నిర్ధారణ అయినట్టుగా విచారణ అధికారి తన నివేదికలో తెలిపారు. విచారణలో ఇంకా అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు పేర్కొన్నారు. తీగలాగితే డొంక కదిలినట్టు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తే, ఎపిఒపై కూడా అభియోగాలు వచ్చిన నేపథ్యంలో అధికారులు ఎలా వ్యవహరిస్తారో అన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

వసూళ్ల కోసం ఒత్తిళ్లు

పని ప్రదేశంలో గుడులు, గోపురాలు లేదా ఇతర సామాజిక కార్యక్రమాల కోసం డబ్బులు వసూలు చేయకూడదని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిబంధనలు ఉన్నాయి. కానీ, చర్చి పేరిట నరవ గ్రామంలో వసూళ్లు జరిగాయి. ఇది కూడా ఎపిడి విచారణలో తేలింది. జూన్ 7న తాము ఎర్ర చెరువు పని చేస్తుండగా వచ్చిన ఎపిఒ చర్చి నిర్మాణం నిమిత్తం ఎవరికి ఎంత కలిగితే అంత డబ్బులు ఇవ్వాలంటూ కోరారని, పై ఆఫీసర్ కావడంతో భయపడి అందరం కలిసి సమకూర్చిన రూ.9వేలు మేట్లు కె.పద్మ, ఎస్.రమ, ఆర్.అనూరాధ, ఎం.దుర్గ ద్వారా రూ.9వేలు ఇచ్చామని తెలిపారు. ఈ నలుగురూ మరో రూ.1000 కలిపి మొత్తం రూ.10,000 ఎపిఒకి ముట్టజెప్పారని వివరించారు.



సిపిఎం జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు

నవంబర్ 9,10న సిపిఎం జిల్లా మహాసభ

జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి తమ్మినేని పిలుపు

ప్రజాశక్తి-గజపతినగరం

సిపిఎం విజయనగరం జిల్లా 10 మహాసభ నవంబర్ 9, 10 తేదీల్లో గజపతినగరంలోని శ్రీ లక్ష్మీనారాయణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. మహాసభ జయప్రదానికి జిల్లా వ్యాప్తంగాను, గజపతినగరం ప్రాంతంలోనూ ప్రజలు ఆర్థికంగా, హార్థికంగా సహకారం అందించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ ఈ మహాసభలో గత మూడేళ్ల కాలంలో చేసిన ప్రజా పోరాటాలను ,ఉద్యమాలను సమీక్ష చేసి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకుని నూతన జిల్లా కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నదన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు పోరాడి ప్రత్యేక హోదా సాధించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. జిల్లాలో నీటి వనరులను పూర్తి స్థాయిలో వినియోగిస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తాటిపూడి, తోటపల్లి, తారకరామా తీర్థసాగర్ వంటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. అతి తక్కువ బడ్జెట్ తో పూర్తి చేయాల్సిన మెంటాడ మండలంలోగల గుర్లగెడ్డ ప్రాజెక్టు 20ఏళ్లు దాటినా పూర్తి చేయలేదన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలకు కావాలని అడుగుతున్నా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని అన్నారు. పరిశ్రమలు మూతపడడం తప్ప కొత్తగా మన జిల్లాకు ఒక్కటి కూడా కొత్తవి రాలేదన్నారు. దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టే విధంగా బిజెపి పాలన సాగిస్తోందన్నారు. దురదృష్టవశాత్తు మన రాష్ట్రం లో ఉన్న టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు బిజెపికి వత్తాసు పలుకుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో చేయబోయే పోరాటాలపై నిర్ణయాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, టివి రమణ, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, నాయకులు రాకోటి రాములు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అంబేద్కర్ ; రామాయణ పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు

వ్యక్తిత్వ వికాస గ్రంథమే రామాయణం

వాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని రామనారాయణం ప్రాంగణంలో వాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్‌ను గురువారం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణంలో ఉన్న అంశాలను అధ్యయనం చేసే ఉద్దేశంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఇటువంటి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. రామాయణం వ్యక్తిత్వ వికాస గ్రంథం అన్నారు. అందులోని విలువలను భావితరాలకు అందించడం దీని లక్ష్యమన్నారు. ప్రపంచంలో కెల్లా భారతీయ నాగరికత అత్యంత పురాతనమైనది అన్నారు. భారత సంస్కృతి పునర్జీవనం కావలసి ఉందన్నారు. భావితరాలకు ఈ పరిశోధన కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు ఈ పరిశోధన కేంద్రం ద్వారా రామాయణ స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్నారు. సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ రాజ్య సభ సభ్యులు టిజి వెంకటేష్, తిరుపతి జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం ఉప కులపతి జిఎస్ఆర్ కృష్ణమూర్తి, చిలుకూరి బాలాజీ టెంపుల్ ట్రస్టీ చిలుకూరు సౌందర్ రాజన్ రంగరాజన్, నారాయణ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ సందర్శన

కోరుకొండ సైనిక్ స్కూల్‌ను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సందర్శించారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, సైనిక్‌స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి స్వాగతం పలికారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

అద్దెబస్సు డ్రైవర్ల సమస్యలపై

30న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు, అద్దెబస్సు డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని ఎపిపిటిడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ కార్మికులు , అద్దె బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు సవరించి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ కూడా కాంట్రాక్టర్లు చెల్లించడం లేదని, హైర్ బస్ డ్రైవర్లకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఒప్పందంలో ఉన్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. వీక్లీ ఆఫ్, సిక్ లీవులు అమలు కోసం జాయింట్ లేబర్ అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. విజయనగరం గ్రౌండ్ బుకింగ్ కార్మికులకు ఆఫ్‌లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌టిసిలో సుమారు వెయ్యి శ్రామిక పోస్టులు, 7 వేల డ్రైవర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. వాటిని అవుట్ సోర్సింగ్, అద్దె బస్సు వర్కర్స్‌తో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు, నాయకులు వెంకటేష్, రాంబాబు, విజయమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీరామ్, నాయకులు

డీసిల్డ్ పనులను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొండచాకరాపల్లి సమీపంలో సువర్ణముఖి నదిలో మట్టి, మడ్డి ఇసుక (డీసిల్డ్) తొలగింపు పనులను జెసి సేతు మాధవన్ గురువారం పరిశీలించారు. నదిలో ప్రస్తుతం ఉన్న నీటి ప్రవాహం, మట్టి, మడ్డి ఇసుకను వేరు చేసే ప్రక్రియను సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించారు. నదిలో కొంతమేర మట్టి పొరలు ఉన్నందున ఇసుక తేలటం లేదని సేకరించిన ఇసుకలో నాణ్యత ఉండటం లేదని వివరించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. యంత్రాలు ఉపయోగించి సిల్ట్ తొలగించకూడదని కూలీలతో తొలగించాలని ఉత్తర్వుల్లో ఉందని అధికారులు జెసి దృష్టికి తీసుకువచ్చారు. డీసిల్డ్ పనుల్లో యంత్రాల ఉపయోగించవచ్చునని ఈ అంశంపై అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని వెల్లడించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు వెళ్లే వాహన వివరాలను నమోదు చేయాలని కొండచాకరాపల్లి కొప్పర సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నదిలో ఉన్న మట్టి మడ్డిని తమ గ్రామానికి రక్షణ గట్టుగా వేయాలని కొండచాకరాపల్లి గ్రామస్తులు జెసిని కోరారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి కె. సందీప్ కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి ధర్మరాజు, ఆర్ఐ జామి మురళి పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న జెసి సేతు మాధవన్

నైపుణ్యాభివృద్ధి అధికారిగా ప్రశాంత్ కుమార్

విజయనగరం కోట : జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా జి.ప్రశాంత్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ నైపుణ్యాభివృద్ధి అధికారిగా చేసిన ఎన్.గోవిందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

జెఎన్‌టియు విద్యార్థుల రక్తదానం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు జివి విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. జిల్లా కేంద్రాస్పత్రి బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యాన ఈచేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 250మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ , వారిని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ వి. మణికుమార్, ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ ఎ.శ్రీనివాసులు, బి.ధర్మారావు పాల్గొన్నారు.

వికలాంగులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

విజయనగరం కోట : వికలాంగులు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని విభిన్నప్రతిభావంతులు సంక్షేమ శాఖ ఎడి జివిబి జగదీష్ అన్నారు. గురువారం లెప్రసీ మిషన్ 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హీల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వికలాంగులు, లెప్రసీ వ్యాధిగ్రస్తులతో వర్క్ షాపు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎంఎన్‌ఒ అధికారి డాక్టర్ అర్చన, హీల్ ప్రాజెక్ట్ మేనేజర్ కిస్మత్ నందా, కోఆర్డినేటర్ డాక్టర్ తాలాడ దీప్తి, హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు సత్తి అచ్చి రెడ్డి, హెల్పింగ్ హేండ్స్ హిజ్రాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండబాబు, సిడిపిఒ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల పోరాటానికి సిఐటియు మద్దతు

విజయనగరం టౌన్ : క్లాప్ డ్రైవర్లు చేస్తున్న పోరాటానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని యూనియన్ కార్పొరేషన్ కమిటీ అధ్యక్షులు ఎ.జగన్ మోహన్ రావు, సభ్యులు ఎస్. పైడిరాజు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద క్లాప్ డ్రైవర్లు చేస్తున్న నిరసన దీక్షకు వారు మద్దతు తెలిపారు.

ఘనంగా ఫార్మాసిస్టు దినోత్సవం

విజయనగరం : స్థానిక మహారాజా ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఉదయ్ శంకర్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫార్మాసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

విజయనగరం టౌన్ : నగరంలోని ఉడా కాలనీకి శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ఆశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. 33/11 కెవి ఉడా సబ్ స్టేషన్‌లో గల 11 కెవి సాయిబాబా టెంపుల్ ఫీడర్‌పై ఉన్న చెట్లు కొమ్మలను తొలగించే క్రమంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సభలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

శత శాతం ఇళ్ల నిర్మాణాలే ధ్యేయం

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశకి-విజయనగరం టౌన్

మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శతశాతం ఇళ్ల నిర్మాణాలే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకై సచివాలయాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2025 నాటికి ఆప్షన్ 1,2 విధానంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈనెల 28వ తేదీన ఆనందగజపతి ఆడిటోరియంలో గృహ లబ్ధిదారులతో మన ఇల్లు మన గౌరవం పేరిట అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఇ శ్రీనివాసరావు, టిపిఆర్‌ఒ సింహాచలం, మన ఇల్లు మన గౌరవం ప్రత్యేక అధికారులు, ఎమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఎమినిటీస్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని కమిషనర్ నిర్వహించారు. తాగునీటి పంపిణీ లో ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూడాలన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' ముగింపు

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సభ స్థానిక 37 వ డివిజన్ బిసి కాలనీలో జరిగింది. కార్యక్రమంలో కమిషనర్ పి.నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రత్యేక అధికారి రోజా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యను పరిష్కరించండి

తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావును కోరారు. గురువారం 10వ డివిజన్లో నగరపాలక సంస్థ అధికారులు పర్యటించారు. పారిశుధ్యం, అంగన్వాడీ కేంద్రాలు, పార్కులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఎఇ సీతారామమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ మోహనరావు

ఉపాధ్యాయుడి తీరుపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థినిపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో డిప్యూటీ డిఇఒ మోహనరావు గురువారం విచారణ చేపట్టారు. విద్యార్థిని లోబరుచుకుని అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఇటీవల డిఎస్‌పి శ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో డిఇఒ ఆదేశాల మేరకు డిప్యూటీ డిఇఒ మోహనరావు గురువారం ఆ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తామని మోహనరావు చెప్పారు. దర్యాప్తులో ఎంఇఒలు లక్ష్మణరావు, శ్రీనివాస్ ఉన్నారు.

సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు

బొబ్బిలి : ఖైదీలు సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు పొందవచ్చని జిల్లా జడ్జి బి.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. స్థానిక సబ్ జైలును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసీ తెలియక చేసిన తప్పులను సరి చేసుకుని మంచి మార్గంలో నడిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఖైదీలలో మానసిక పరివర్తన రావాలన్నారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు నాణ్యమైన భోజనం పెట్టాలని జైల్ అధికారులకు సూచించారు. ఆయనతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు ఉన్నారు.

నగరంలో భారీ వర్షం

ప్రజాశక్తి-విజయనగరం కోట

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం జిల్లా కేంద్రమైన విజయనగరంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా, మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజల రాకపోకలు ఆటంకం కలిగింది.

కొండను తవ్వేస్తున్నారు!

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పూల్‌బాగ్ మంగళవీధి కాలనీ వెనుక భాగంలో ఉన్న కొండను కొంతమంది రాత్రిపూట తవ్వేసి యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. కొండను తవ్వి భూమిని చదును చేసి ఇళ్ల స్థలాలు కింద అమ్ముకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నగరానికి శివారు ప్రాంతం కావడం, పెద్దగా అటువైపు జన సంచారం లేకపోవడంతో కబ్జాదారులు బరితెగించి రాత్రి సమయంలో కొండను తవ్వి చదును చేసి ఆక్రమణలకు పాల్పడి ఇళ్ల స్థలాలు కింద ఆమ్ముకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని ఇళ్ల స్థలాలు ఆక్రమించి కట్టుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం యంత్రాంగం వెంటనే స్పందించి ఆక్రమణలు ఆపకపోతే కొండ కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

వరద బాధితులకు విశ్రాంత అధికారి విరాళం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయం అందిస్తూ సమాజంలోని పలు వర్గాలవారు ముందుకు వస్తున్నారు. జలవనరుల శాఖలో ఉప కార్యనిర్వాహక ఇంజినీరుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన నగరంలోని పద్మావతి నగర్‌కు చెందిన ఎల్.ఆర్.సత్యనారాయణ వరద బాధితుల సహాయార్థం రూ.20 వేలు విరాళం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం చెక్కును జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు గురువారం కలెక్టరేట్‌లో అందజేశారు. వరద బాధితుల సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన సత్యనారాయణను కలెక్టర్ అభినందించారు.

29న గుండె పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు

తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి తిరుమలప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 29నప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల -మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలువురు గుండెవైద్య నిపుణులతో కలిసి ఆయన మాట్లాడారు. హార్ట్‌డే సందర్భంగా 29న నగరంలో గుండె పరిరక్షణపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీని కోట వద్ద జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, నగర్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఆసుపత్రి సెమినార్ హాల్లో గుండె సమస్యలపై ప్రత్యేక వైద్యులతో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వయోవృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో ఉచితంగా బిపి, షుగర్, ఇసిజి తదితర పరీక్షలను మొదటగా పేరు నమోదు చేసుకున్న 100 మందికి ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో గుండెవైద్యనిపుణులు డాక్టర్ శరత్ కుమార్ పాత్ర, డాక్టర్ బి.రవికుమార్, డాక్టర్ జి.వాసుబాబు, డాక్టర్ ఆర్.వి.దుర్గాప్రసాద్, ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎస్.మల్లిఖార్జునరావు, డాక్టర్ భట్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి తిరుమలప్రసాద్

సిపిఆర్‌పై పోలీసులకు శిక్షణ

ప్రపంచ హదయ దినోత్సవంలో భాగంగా తిరుమల-మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి సిపిఆర్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఫ్రంట్ లైను వారియర్ గా సమాజానికి ఇంకామెరుగైన సేవలందించేందుకు పోలీసు సిబ్బందిని సిపిఆర్ నిర్వహించడంలో సుశిక్షులను చేసేందుకు తిరుమల-మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. తిరుమల-మెడికవర్ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ దొమ్మీలు, తొక్కిసలాటలు జరిగినప్పుడు మనల్ని మనం రక్షించుకొంటూ, ఇతరులను రక్షించేందుకు పోలీసు సిబ్బందికి తప్పనిసరిగా సిపిఆర్ చేసే విధానం పట్ల అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్డియాక్ వైద్యులు డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ జి.రామారావు, షరీన్ హసన్ భట్, డాక్టర్ రామలక్ష్మి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్‌స్‌ని ప్రక్షాళన చేయాలి

రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్ర సివిల్ సప్లై వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితి ఉందని రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గద్దె బాబూరావు అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు సివిల్ సప్లయ్‌స్ డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలను తెలిపారు. రాష్ట్రంలో సివిల్ సప్లయ్‌స్ పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో చాలా అవకతవకలు జరిగాయని వాటన్నింటినీ సరి చేసుకుంటూ ప్రజలకు మంచి సేవలను అందిస్తానని అన్నారు. అనంతరం గద్దేకు రాష్ట్ర డైరెక్టర్ రావడం పట్ల పలువురు కలసి బొకేలు ఇచ్చి సన్మానించారు.

ప్రజా సమస్యలపై అధికారులు చొరవ చూపాలి

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రజా సమస్యలపై అధికారులు చొరవ చూపాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సామాజిక సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు సహకారం తీసుకోవాలని సూచించారు. తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, వ్యవసాయ అధికారి పివి.మల్లికార్జునరావు, ఎంఇఒ శోభారాణి, ట్రాన్స్‌కో ఎఇ జి.శంకర్, పశు వైద్యాధికారి కిరణ్‌కుమార్, పలువురు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను సభ్యులకు వివరించారు. జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ రావు, వైస్ ఎంపిపిలు గొండెల ఈశ్వరరావు, మీసాల సరోజినీ, ఎంపిడిఒ వైవి.రాజేంద్రప్రసాద్, సిడిపిఒ డి.ఉమాభారతి, ఎంఇఒ-2 అల్లు వెంకటరమణ, ఎఒ వెంకటరమణ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కమిషనర్ ను కలిసిన కర్రోతు

ప్రజాశక్తి-భోగాపురం

బంగార్రాజును సత్కరిస్తున్న ఢిల్లీరావు

వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావును మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఢిల్లీ రావు బంగార్రాజుకు శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డిని కూడా అయన మర్యాదపూర్వకంగా కలిశారు.

బిసిజి టీకాల పరిశీలన

బొండపల్లి : గొట్లాం, బొండపల్లి హెల్త్ వెల్నెస్ సెంటర్లలో నిర్వహిస్తున్న బిసిజి టీకాల కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర టిబి అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమం ఎలా అమలవుతుంది? ఇంకా ఎంతమందికి వేయాల్సి ఉందోనని ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాడీ మాస్ ఇండెక్స్ ఏవిధంగా లెక్కించాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎస్ఎ బాషా, జిల్లా టిబి ప్రోగ్రాం కోఆర్డినేటర్ వివిఎస్ కుమార్, జిల్లా డాట్స్ ప్లస్ సూపర్వైజర్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వర రావు, ఎఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

1న చెకుముకి టాలెంట్ టెస్టు

బొబ్బిలి : విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు అక్టోబర్ ఒకటో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పోల సత్యంనాయుడు తెలిపారు. టాలెంట్ టెస్టు వాల్‌పోస్టర్లను గురువారం శ్రీనిధి పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలను నివారించి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేందుకు సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 8,9,10 మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు కె.కృష్ణదాసు, ఎస్‌వి రమణమూర్తి, ఎ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు అలవాటైతే బానిసత్వమే

శృంగవరపుకోట : యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు బానిసత్వం అవుతుందని సిఐ వి.రమణమూర్తి తెలిపారు. గురువారం పట్టణంలోని చైతన్య కళాశాలలో డ్రగ్స్ వాడకం వల్ల దుష్పరిణామాలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యాంటీ డ్రగ్స్ కమిటీ, డ్రగ్స్ కంప్లైంట్స్ బాక్స్‌ను కాలేజీలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు అవార్డు

శృంగవరపుకోట : విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్, టి.వి టూరిజం ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డును గ్రీన్‌ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బి.రామకృష్ణకు ప్రదానం చేశారు. జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ఇతర అతిథులు జ్ఞాపికను, ధ్రువపత్రాన్ని ఆయనకు అందజేశారు. యోగా, పర్యావరణ రంగాలలో రామకృష్ణ చేస్తున్న సేవలను కొనియాడారు.

'బి న్యూ' మోసాలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి : సెల్‌ఫోన్లు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వినియోగదారులను మోసగిస్తున్న బిన్యూ షాపు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. బిన్యూ షాపులో క్రెడిట్ కార్డు ద్వారా సెల్ ఫోన్లు కొనుగోలు చేస్తే క్యాష్ బ్యాక్ వస్తుందని చెబుతున్నా, కొనుగోలు తర్వాత ఎటువంటి నగదూ తిరిగి ఇవ్వడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి మోసాలకు పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

నెల్లిమర్ల : విద్యార్థులకు చట్టాలపై అవగహన ఉండాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. గురువారం సతివాడ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ రూల్స్, జీవిత లక్ష్యాల పై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాడుల పట్ల భయపడకుండా ఎదుర్కొని పోక్సో చట్టం గురించి తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి రహదారి ప్రమాదాలు నివారణకు సహకరించాలని కోరారు. ప్రిన్సిపాల్ టి.పద్మలత విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

రేగిడి :మండలంలోని పెద్ద శిర్లాం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం అంగన్వాడి కేంద్రాలలో గర్భిణులకు ఎంపిడిఒ శ్యామల కుమారి సీమంతాలు చేశారు. ముందుగా అంగన్వాడీలు, పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. గ్రామంలో అర్హులైన వారి నుంచి పెన్షన్లు, రేషన్ కార్డులు ఇతర పథకాలు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలవలస రామచంద్ర నాయుడు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎపిఎం బాసిన గోవిందరావు, ఎపిఒ హరినాథ్, ఆర్ఐ రేవతి, అంగన్వాడి కార్యకర్త అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని చినగుడిపాల ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఇఒ జగదీశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ గార్డెన్, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల ప్రహరీ అసంపూర్తిగా ఉందని, నిర్మాణం పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులు జి.మల్లేశ్వరి కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అప్పలనాయుడు, శివలక్ష్మి, సిఆర్‌పి సునందన పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

శృంగవరపుకోట : పట్టణంలోని కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మండల స్థాయి బాలుర ఆటల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఇఒ పి.జి.లక్ష్మి, కేంబ్రిడ్జ్ నారాయణ ఎజిఎం జి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ బి.శివప్రసాద్, పీడీ జి.లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో 280 మంది పాల్గొన్నట్లు మండల క్రీడా కోఆర్డినేటర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణి, స్వాతి, వెంకటలక్ష్మి, విజయశాంతి, గోపి, గణేష్ పాల్గొన్నారు.

గ్రామ సందర్శనలో సమస్యలపై ఏకరువు

నెల్లిమర్ల.. పశువైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గొలగాం గ్రామంలో జరిగిన గ్రామ సందర్శనలో గ్రామస్తులు సమస్యలపై ఏ కరువు పెట్టారు. గురువారం గొలగాం సచివాలయంలో ఎంపిడిఒ డిడి స్వరూప రాణి ఆధ్వర్యంలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారి జమదగ్ని హాజరై గ్రామస్తులను సమస్యలు తెలపాలని కోరగా. గ్రామ సర్పంచ్ బూర్ల అప్పలనాయుడుతో సహా గ్రామస్తులంతా మంచినీటి సమస్యతో గ్రామస్తులమంతా ఇబ్బంది పడుతున్నామని ఈ సమస్యగత కొంతకాలంగా ఉన్నప్పటికీ అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని ఏకరువు పెట్టారు. గ్రామంలో డ్రైనేజీ, సిసి రోడ్లు లేక దోమల బారిన పడుతున్నామని దీనివల్ల అనారోగ్యాలకి గురికావాల్సి వస్తుందని ప్రత్యేక అధికారి దృష్టికి తెచ్చారు. పలు సమస్యలను గ్రామ సందర్శనలో తెలుపుతూ పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. అధికారుల బృందం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, అన్ని శాఖల అధికారులు, గ్రామ ఉప సర్పంచ్ అచ్చంనాయుడు, టిడిపి నాయకుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని మొయిదలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాస్ గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పరిశీలించి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి. గిరిబాల, తహశీల్దారు పి.సుదర్శన రావు, ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి, హౌసింగ్ ఎఇ ఆర్.పవన్, సర్పంచ్ అట్టాడ కృష్ణ, జనసేన నాయకులు పతివాడ అచ్చం నాయుడు, తదితరుల పాల్గొన్నారు.

రామభద్రపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా పని చేయాలని ఎంపిడిఒ రమామణి సూచించారు. మండల పరిధిలోని గొల్లల పేటలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సామాజిక, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా అధికారులు సమయపాలన పాటించి పారదర్శకంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం వంటలు, అంగన్వాడీ కేంద్రాన్ని, సచివాలయంలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పార్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారుల తీరు మారకపోతే చర్యలు

ప్రజాశక్తి -మెంటాడ

మండలంలోని అమరాయవలసలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని గురువారం మండల ప్రత్యేక అధికారి ప్రమీల గాంధీ, సర్పంచ్ యాసరపు అప్పన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆమె చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. రేషన్ డిపో వద్ద స్టాకు రికార్డు బోర్డు లేకపోవడంతో డీలర్‌పై ఆమె మండిపడ్డారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చిన సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకపోతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉండడంతో పిల్లలను చేర్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని సర్పంచ్‌తోపాటు గ్రామస్తులు చెప్పడంతో వేరే పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటానని ప్రత్యేకాధికారి హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావు, వైస్ ఎంపిపి పొట్టంగి దుర్గ, హౌసింగ్ జెఇ డేవిడ్ ప్రసన్నకుమార్, ఇఒపిఆర్‌డి విమల కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ హైమావతి, ఎపిఒ చిన్నప్పయ్య, ఎంఇఒ శర్మ పాల్గొన్నారు.

గ్రామ సందర్శనలో ప్రత్యేకాధికారి మండిపాటు

వేపాడ : మండలంలోని ముకుందపురంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, అంగన్వాడీ, రేషన్ డిపోను ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సందర్శన కార్యక్రమం ద్వారా గ్రామంలో సమస్యలు తెలుసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. వాటి పరిష్కారానికి నివేదిక తయారుచేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎంఇఒ పి.బాలభాస్కరరావు, సర్పంచ్ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతా లోపమే కారణం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆహార నాణ్యతా లోపమే ఫుడ్ పాయిజన్‌కు కారణమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు తెలిపారు. పట్టణంలోని ఎస్‌సి బాలికల కళాశాల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. గురువారం సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అనంతరం వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహ సిబ్బంది నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చేందుకు విద్యార్థినులు బయట ఆహారం తిన్నారని పత్రికల్లో రాయించారని గాడి అప్పారావు తెలిపారు. హాస్టల్లో భోజనం నాణ్యత లేకపోవడమే కారణమని, దీనిని కప్పిపుచ్చేందుకే విద్యార్థులపై నిందలు వేస్తున్నారని డిఎస్‌డబ్ల్యు అండ్ ఇఒ రామానందాన్ని, హెచ్‌డబ్ల్యుఒ కె.విజయనిర్మలను ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, అనూష, చరణ్, ఇంద్ర, లవకుశ, పి.రత్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, సిపిఎం నాయకులు

విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఫుడ్ పాయిజన్‌తో స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌సి బాలికల వసతిగృహ విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను వాకబు చేశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి , రాష్ట్ర ఫోక్, కల్చరల్ మాజీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, సర్పంచులు కూనిరెడ్డి వెంకటరావు, మమ్ములూరి సోంబాబు, జుత్తాడ సూర్యారావు, కొత్తూరు సత్యం, ముమ్ములూరి సోంబాబు, మెరపల పురుషోత్తమనాయుడు, తలారి అనంత్, ఎంపిటిసి అప్పయ్య పాల్గొన్నారు.

28న ఆలయాల్లో సంప్రోక్షణ : వైసిపి

ప్రజాశక్తి-చీపురుపల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం విశిష్టతను చంద్రబాబు దెబ్బతీసారని అందువల్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్ననేపథ్యంలో వైసిపి ఆధ్వర్యాన ఈ నెల 28న ఆలయాల్లో సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవుడి పేరు చెప్పి రాజకీయాల చేస్తున్నారని అది మంచి పద్ధతి కాదని అన్నారు. మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 28న నియోజకవర్గ స్థాయిలో ఆంజనేయపురం మెయిన్‌రోడ్డులో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రక్షాళన పూజలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

హమాలీల నిరసన

బొబ్బిలి : సివిల్ సప్లయ్ హమాలీలకు పాత కూలి రేట్లు బకాయిలు తక్షణమే చెల్లించాలని కళ్లకు గంతలు కట్టుకొని గురువారం గ్రోత్‌సెంటర్ వద్దనున్న ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. మేస్త్రీలు పొందూరు గోపి, మెండి నరసింహులు మాట్లాడుతూ పాత బకాయిలు చెల్లింపులకు, కొత్త కూలి రేట్ల పెంపునకు జిఒ జారీచేయాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం యుద్ధ స్తంభం పార్కులో పారిశుధ్య పనులు చేశారు. పార్కు రోడ్లు శుభ్రం చేసి గోడలకు సున్నం వేశారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యంగా ఉండగలమని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వందరోజుల పాలన సంతృప్తికరం

రామభద్రపురం : కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన సంతృప్తికరంగా ఉందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండలంలో నాయుడువలసలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్‌తోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం వాల్ స్టిక్కర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నడిమింటి లక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, బిసి సెల్ అధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ రమామని పాల్గొన్నారు.

పార్కులో చెత్తను ఊడ్చుతున్న ఎమ్మెల్యే బేబినాయన

సిఎం సహాయనిధికి విరాళాలు

విజయవాడ వరద బాధితుల కోసం పట్టణ కళాసీ సంఘం రూ.30 వేలు, అలజంగి గ్రామ యువత రూ.21,100 విరాళాలను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ఇచ్చినట్లు పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు బి.అప్పలస్వామి, అలజంగి యువకులు అన్నారు. దాతలను బేబినాయన అభినందించారు.

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం..భవిష్యత్తును కాపాడుకుందాం

పలుచోట్ల ఎస్ఎఫ్ఐ ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం అనే లక్ష్యంతో ఈ నెల 28, 29, 30 తేదీలలో జరగబోయే భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యాన గురువారం ఆర్‌టిసి కాంప్లెక్సు, తోటపాలెం, రైల్వే స్టేషన తదితర ప్రాంతాల్లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కళాశాల నుండి వచ్చిన విద్యార్థి బృందాలు పలు సినిమా పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్ మాట్లడుతూ జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న డ్రగ్స్ మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఇదే సందర్భంలో స్త్రీలపై జరుగుతున్న దాడులను వారు ఖండించారు. ఈనెల 28 నుంచి నిర్వహించే ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్ సమీరా, ఎం రమేష్ , రాజు , సుస్మిత , రమణ , చరణ్ పాల్గొన్నారు.

ఫ్లాష్‌మాబ్ చేస్తున్న విద్యార్థులు

ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 81/2023

శ్రీ చుక్క ఈశ్వరరావు ....వాది
శ్రీ జయంతి గౌరిశంకర్ ....ప్రతివాది

To
శ్రీ జయంతి గౌరిశంకర్, S/o శీతారామారావు, డోర్ నెంబరు 8-18-41, బాలాజీనగర్, విజయనగరం టౌను మరియు జిల్లా.

పై నెంబరు దావాలో గల షెడ్యూలు దాఖలా ఆస్తికి ఇందలి వాదికి గల క్రయయెగ్రిమెంటు ప్రకారం క్రయదస్తావేజు వ్రాయించి రిజిష్టరీ చేయగలందులకు కోరుచూ మీపైని దావా దాఖలు చేసియున్నారు. కావున యీ విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తే 24-10-2024దిని పగలు 10-30 నిIIలకు పై కోర్టువారి యెదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయ్యి సదరు విషయమై మీ వాదనకు సంబంధించిన దస్తావేజులతో మీ స్టేట్‌మెంటు దాఖలు చేసుకొని వాదించుకోవలెను. అట్లు కాని యెడల సదరు దావాను మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది. కాగా ఇవి పై కోర్టువారి ఆర్డరు ప్రకారం ప్రకటించడమైనది.

ఇట్లు
శ్రీ పోతుల రాంబాబు
వాది తరుపు న్యాయవాది,
విజయనగరం,
సెల్: 9996458999

విజయనగరం
తే 26.9.2024ది

అవనాపు దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్ కల్యాణ్

జనసేనలో చేరిన అవనాపు విక్రమ్ దంపతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరానికి చెందిన వైసిపి యువజన విభాగం నాయకులు అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన దంపతులు గురువారం జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో విజయవాడలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పవన్ కల్యాణ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు పలువురు కార్యకర్తలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పల్లె పల్లెకు జనసేన పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సూచించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ గురువారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలు, ముఖ్య కూడళ్ళలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును చూశారు. రహదారి ప్రమాదాలు, దొంగతనాలు జరిగినపుడు వాహనాలను కంట్రోల్ రూం నుండి ఏవిధంగా ట్రాక్ చేయవచ్చును, సిసి ఫుటేజులను, సిసికెమెరాల పర్యవేక్షణలో ఉన్న ప్రాంతాలను, ప్రత్యక్షంగా జరుగుతున్న ధర్నాలను, సంఘటనలను కమాండ్ కంట్రోల్ రూం నుండే ఎలా పర్యవేక్షించవచ్చును అనే అంశాలను పరిశీలించారు. సిగ్నల్ పాయింట్ల వద్ద ఎం.వి. నిబంధనలు పాటించకుండా సిగ్నల్ జంపింగుకు పాల్పడుతున్న వాహనదారులపై ఆటోమేటిక్ గా ఈ-చలానా జనరేట్ అవుతాయని కమాండ్ కంట్రోల్ రూం సిబ్బంది, ఆర్‌టిజి. సిబ్బంది ఎస్‌పికి వివరించారు. త్వరలో మరిన్ని సిసి కెమెరాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి, పెద్ద స్క్రీన్లకు అనుసంధానం చేసి, కమాండ్ కంట్రోల్ రూం నుండి పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ ఎవి లీలారావు, కమాండ్ కంట్రోల్ రూంసిబ్బంది పాల్గొన్నారు.

యువత వ్యసన విముక్తులు కావాలి

రామభద్రపురం : యువత వ్యసన విముక్తులై సన్మార్గంలో నడుచుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు పిలుపు నిచ్చారు. గురువారం సాయంత్రం కొట్టక్కిలో పోలీసు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల వైపు ఆకర్షితులు కాకుండా వారి దృష్టికి వచ్చిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలను దగ్గరలో ఉన్న పోలీసు స్టేషనుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికా, మహిళా సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని వీరిపై ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక అభ్యుదయ పాఠశాలలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తం కొరతను నివారించేందుకు రక్తదాన శిబిరం నిర్వహించినట్లు అభ్యుదయ పాఠశాల కరస్పాండెంట్ మర్రాపు కూర్మినాయుడు(నాని), ప్రిన్సిపల్ చింతా శారద చెప్పారు. 105 మంది నుంచి బొబ్బిలి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు.

గుంతల్లో కూరుకుపోయిన లారీ

బొబ్బిలి : పట్టణంలోని రాజా కళాశాల రోడ్డులో ఉన్న గుంతల్లో లారీ కూరుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రేన్ సహాయంతో లారీని బయటకు తీయడంతో వాహనాలు రాకపోకలు యథాతథంగా సాగాయి. రోడ్డుపై పెద్ద గోతులు ఉండటంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బాలకావివలస గ్రామానికి చెందిన కొడిశ వెంకటరమణ (38) అప్పులు బాధ తాళలేక పురుగులు మందు తాగి గురువారం తెల్లవారి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. మృతుడు వెంకటరమణ తన ఇంటి మీద అప్పులతో పాటు ఇఎంఐ పేరుతో కొన్ని వస్తువులు కొనుగోలు చేసి, అవి కట్టలేక ఆర్థిక సమస్యలతో మనస్థాపానికి గురై రాజాంలో పురుగులు మందు తాగి స్వగ్రామానికి వస్తుండగా మునకలవలస సమీపంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గ్రామానికి చెందిన కొంతమంది చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాజాం కేర్ ఆస్పత్రిలో వైద్యం కోసం తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడి నుంచి మరింత మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో చిలకపాలెం జంక్షన్ వద్ద మృతి చెందాడు. మృతుడు భార్య చంద్రకళ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. ఎఎస్ఐ జి.గౌరు నాయుడు తన సిబ్బందితో రాజాం సామాజిక ఆసుపత్రికి వెళ్లి పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడుకు భార్య చంద్రకళతో పాటు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

వ్యాన్ దగ్ధం

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలో గర్భాం నుంచి కొత్త కర్రకు ఇటుకలతో వెళ్తున్న ఐచర్ డిసిఎం వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు బుధరాయ వలస ఎస్ఐ జె.లోకేశ్వరరావు తెలిపారు. బైరిపురం గ్రామానికి చెందిన వ్యాన్ యజమాని పప్పల శ్రీనివాసరావు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. నిరు పేద కుటుంబానికి చెందిన వ్యాన్ యజమాని శ్రీనివాసరావు గత పదిహేను సంవత్సరాలుగా వ్యాన్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. జీవనాధారంగా ఉన్న వ్యాన్ ప్రమాదంలో కాలిపోవడంతో తన కుటుంబం రోడ్డున పడుతుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

బెర్మ్ దిగింది.. బోల్తా పడింది

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిలోని ఏ రావివలస నుంచి చేపల కంచేరు వెళ్లే రహదారిలో రావివలస సమీపంలో గురువారం లారీ బోల్తా పడింది. గుజరాత్ నుంచి భారీ పైపుల లోడుతో విమానాశ్రయం లోపలకు వెళ్తున్న లారీ మరో వాహనాన్ని తప్పించబోయి బెర్మ్‌పైకి దిగింది. తిరిగి బెర్మ్ పైనుంచి రోడ్డు ఎక్కేందుకు చాలా సేపు ప్రయత్నించినప్పటికీ కుదరక బోల్తా పడింది. ఈ రోడ్డుకు ఇరువైపులా ఎల్ అండ్ టీ సంస్థకు సిమెంటు, ఇనుము వంటి లోడ్లతో భారీ వాహనాలు రాకపోకలు చేస్తుండడంతో రోడ్డుకు ఇరువైపులా బెర్ములు పాడైపోయి గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల ప్రజాశక్తిలో హెచ్చరిస్తూ బెర్మ్ దిగితే బోల్తా పడాల్సిందే అనే ప్రత్యేక కథనం కూడా వెలువడింది. కానీ సంబంధిత సంస్థ పట్టించుకోకపోవడంతో అదే సంస్థకు లోడుతో వెళుతున్న ఈ లారీ బోల్తా పడింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

కోడిపందేలపై దాడులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి గ్రామ పరిధిలో గురువారం కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ దేవి దాడులు చేపట్టారు. నాలుగు కోడి పుంజులు, రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దేవి తెలిపారు.